ప్రజానీకం కోసం వ్రాయడం ఏమీ కష్టంగాదు. అందు కిష్టం లేక కుంటిసాకులు చెప్పుకోడం మన శ్శుద్ధికి నిదర్శనం కాదు. తాము నిస్పృహలో పడి, నిరాశావాదులైనది గాక, మిగిలిన రచయితల్లో గూడా అపోహలు కలిగించి అలాంటి వాతావరణం కలిగించడానికే యీ విపరీత వ్యాఖ్యానాలు తోడ్పడతాయి.

ఇవేళ రెండే రెండు పక్షాలు. ఒకటి: అమెరికా పెట్టుబడిదారీ వర్గ నియంతృత్వంతో వివిధ దేశాల్లో ఉన్న ప్రజాఉద్యమాల నణచే ఆయా దేశ పెట్టుబడిదారీవర్గ నియంతృత్వంతో గూడిన ప్రభుత్వపక్షాలు. రెండవది: సోవియటు ప్రజా ప్రభుత్వాల నాయకత్వాన, ఆయాదేశ కార్మిక వర్గాల నాయకత్వాన ప్రజాతంత్ర సంఘటనలో జేరి, ప్రజాతంత్ర విప్లవంకోసం పోరాడే ఆయా దేశ ప్రజాపక్షాలు. రెండే రెండు సాహిత్యాలు: అభివృద్ధి నిరోధకమైన బూర్జువాసాహిత్యం, అభ్యుదయకరమైన ప్రజాసాహిత్యం. మూడో పంథా అబద్ధం.

ప్రజలయెడ తమ బాధ్యతను విస్మరించి, పెట్టుబడిదారీ ప్రభుత్వ నిర్బంధాలకు జడిసి, ప్రజాసాహిత్యం కోసం పోరాడలేక అందు కేదో కుంటిసాకులు చెప్పుకున్నంత మాత్రాన ప్రజలు విశ్వసించజాలరు.

---

<u>కొత్త పద్ధతులు</u>

# ఉపన్యాసాలు 14-10-49

"రావు"

ఉపన్యాసమంటే బెంగాలీవాళ్ల కలంతోనూ, తెలుగువాళ్ల నోటితోనూ చేసే ఊకదంపుడు. దేశం స్వతంత్రం కాకపూర్వం ఉపన్యాసాలకు-రాజకీయోపన్యాసాలకు—అంతో ఇంతో అర్థం ఉండేది. ఇప్పు డదీ లేదు.

వెనకటి రోజుల్లో ఉపన్యాసకుడు గొప్ప వక్త అయినా కాకపోయినా, అతగాడు చెప్పే విషయం మనకు ఏ మాత్రమూ కొత్తకాకపోయినా ఉపన్యాసం చేసేవాడికీ, వినేవాడికీ కూడా ఏదో చైతన్యం కలిగేది.

ఇప్పుడు రాజకీయోపన్యాసాలు సన్నాయి మేళాలవతూ, మేజువాణీలవతూ, హరికథలవతూ, తోలుబొమ్మలవతూ అయిపోయాయి. నలుగురు చేరి డబ్బు ఏగాని ఖర్చుకాకుండా కొంతకాలం "నాశనం" చెయ్యటానికి ఇదివరలో ఏవేవయితే ఉపకరించేవో వాటన్నిటి స్థానమూ ఉపన్యాసం ఆక్రమించేస్తున్నది. కాఫీహోటలు తెరిస్తే ఉపన్యాసం. కిల్లీకొట్టు తెరిస్తే ఉపన్యాసం. సోడాషాపు తెరిస్తే ఉపన్యాసం. పెళ్లయితే ఉపన్యాసం. పిల్లలుపుడితే ఉపన్యాసం. ఈ ఉపన్యాసాలను ఫ్రీ సర్వీసు వినోదాలన్నిటితోనూ పోల్చటంకూడా పొరపాటే. తోలుబొమ్మలూ, మేజువాణీలూ కొంత వరకు "రంజు"గానన్నా ఉంటాయి. ఈ ఉపన్యాసాలు కేవలమూ రాం భజనలతోనూ, హరికథలతోనూ సమానం. అంటే అందులో వినేటందుకు ఏమీ ఉండదు. అంతా రొకటి పాట. హరిదాసుగారు సభవారిని "హే భక్తాగ్రేశరులారా!" అంటే, ఉపన్యాసకుడు "హే దేశభక్తులారా!" అంటాడు. వినే వాళ్ళలో మఫ్టీలో ఉన్న మార్క్సిస్టులూ, యాంటీకాంగ్రెసువాళ్లూ, విమర్శకులూ ఉండవచ్చని ఉపన్యాసకుడి బుర్రకు ఎక్కనే ఎక్కదు.

"ఈ సోడాషాపు (లేక కిల్లీకొట్టు) ఆరంభించిన శ్రీ ఫలానివారు నా చిరకాలమిత్రులు. ఆయన ఈ సోడా పానీయాలు సత్యాహింసలకు చచ్చు లేకుండా గాంధీజీ సిద్ధాంతాల ననుసరించి దేశభక్తితో ప్రజలకు సప్లయిచేసి లక్షలు గడించి

14-10-1949

అపారమైన దేశసేవ చేసి, దేశంయొక్క సంపద హెచ్చించటానికీ, అంతర్జాతీయ వాణిజ్యం పెంపొందించటానికీ తోడ్పడతారని విశ్వసించుదాం..."

ఈలోగా ఉపన్యాసకుడికి అసలువిషయం మరిచిపోయానని తోస్తుంది.

"సోడా అంటే జ్ఞాపకంవచ్చింది. మేమంతా వంథొందల ముప్ఫయ్యెట్లో వేలూరు సబ్జయిల్లోంచి మద్రాసు వస్తుండగా దాహమయింది. ఎక్కడా నీళ్లు లేవు. స్పెన్సరువాణ్ణి పిలిచి తలా పది సోడాలూ తీశాం. మహా బాగున్నాయి."

ఇంకా అసలు విషయం అందటంలేదు.

"ఇదంతా ఎందుకు చెప్పానంటే అప్పుడు మనం (హే దేశ భక్తులారా!) పడ్డ కష్టాలు వృథా కాలేదు. గాంధీజీ ధర్మమా అంటూ మనం (డిటో) గట్టెక్కాం. స్వరాజ్యం వచ్చింది. స్వాతంత్ర్యం వచ్చింది. దేశం ఇవాళ కాకపోతే రేపన్నా సుభిక్షం అయితీరవలసిందే. దీనికి తిరుగులేదు. మీరు సందేహించవలసిన అవసరం ఎంతమాత్రమూ లేదు."

కాస్త పాతాన పడుతున్నది.

"ఇక ఆంధ్ర రాష్ట్రం మాటా. అదీ వస్తుంది. రాకేం జేస్తుంది? ఎందుకు రాదు? ఎవడికోసం వస్తుంది? రాక ఎక్కడికి పోతుంది? మన పట్టాభి ఉన్నాడు, మన నెహ్రూ ఉన్నాడు, మన సర్దారున్నాడు, మన - మన - మన వాళ్లంతా ఉన్నారు. మనమందరమూ ఉన్నాం."

(హర్షధ్వనులు)

ఉపన్యాసం రక్తి కట్టేస్తున్నది. ఈ వేడిమీదే రెండు దెబ్బలు కొట్టాలి.

"ఆంధ్ర రాష్ట్రం వస్తున్నది-వచ్చేసిందీ! ఇక మనం దాన్నిగురించి ఆలోచించవద్దు. దాన్ని పూర్తిగా మరిచేపొమ్మని మనవి చేస్తున్నాను. (చప్పట్లు) కాని-ఆంధ్ర రాష్ట్రం వచ్చిందని సంతోషమూ, కానేకాదు! ఆంధ్రరాష్ట్రం రావటం ప్రధానం కానేకాదు. అసలది, నన్నడిగితే అనవసరం, వ్యర్థం, నిరుపయోగం. (వినేవాళ్ల ఆశ్చర్యం) ఈ ఆంధ్ర రాష్ట్రం ఎట్లా ఉండబోతుంది? మనలో కమ్యూనిజం జాడ్యం వ్యాపించినట్టుగా ఇంకే రాష్ట్రంలోనూ వ్యాపించలేదు. ఆంధ్రరాష్ట్రం వచ్చాక మనం మన రాష్ట్రాన్ని చూసి సిగ్గుపడి తలవంచుకోవలసి వస్తుంది. మన రాష్ట్రంలో అరాచకంతప్ప ఉండదు. మనకన్నా కమ్యూనిస్టుల ఉధృతం జాస్తిగా ఉన్న బెంగాలు చూడండి. అక్కడి రాజకీయాలు చూడండి. సిగ్గు, సిగ్గు! ఎంతకాలమైతే మనమీ కమ్యూనిస్టు పీడను, ఈ హంతకులను, ఈ హింసావాదులను వదలించుకోలేమో అంతదాకా మనం ఆంధ్రరాష్ట్రం అడగనేరాదు నిజం పడితే. ఈ పీడ వదిలించుకుని మనం సవినయంగా సర్దార్జీ దగ్గిరికిపోయి, 'అయ్యా, సర్దార్జీ మేం మా రాష్ట్రాన్ని కమ్యూనిస్టు రహితం చేశాం. మాకు దయచేసి ఆంధ్రరాష్ట్రం ఇప్పించండి', అంటే మద్రాసుతో సహా వచ్చేస్తుంది. రా కెక్కడికి పోతుంది? మద్రాసూ, దాని బాబూ కూడా వస్తుంది—మనలో తప్పు లేకుండా ఉంటే... ఇదుగో, రిపోర్టర్లూ! ఈ ముక్కలు రాసుకోకండి..."

ఇదంతా రాజకీయ రాంభజన.

సాహిత్య రాంభజన అది ఇంకో మోస్తరుగా ఉంటుంది. బ్రాహ్మణార్థాలు చేసేవాళ్ళకి దొడ్డి సంభావనలూ, సంతర్పణలూ, తద్దిన బ్రాహ్మణార్థాలూ లేకపోతే ఎంతబాధో సాహిత్యపరులకు ఉపన్యాసాలిచ్చే అవకాశాలు లేకపోతే అంతబాధ. బొత్తిగా గిరాకీలేని సమయంలో ఏబట్టలకొట్టు గుమాస్తాలసంఘంవాళ్లు మీటింగులు చేసి పిలిచినా మన సాహితీపరుడు మాట్లాడటానికి ఒప్పుకుంటాడు.

సాహిత్య ఉపన్యాసాలలో విశేషమేమంటే, ప్రతిక్షణమూ ఉపన్యాసకుడు—రంగస్థలంమీది నటుడులాగా—సదస్యుల దృష్టి తన మీదికే తిప్పుకోవటానికి ప్రయత్నిస్తాడు. ఈప్రయత్నం వెనకటిరోజుల్లో గోప్యంగా ఉండేది. ఇప్పుడు కట్టు తెగింది.

"నన్ను మాట్లాడమన్నారు. ఇక్ష్వాకుల్ని గురించి మాట్లాడమన్నారు. ఇక్ష్వాకుల్నిగురించి మాట్లాడడానికి నేను తప్ప ఆంధ్రదేశంలో ఎవరున్నారూ? బెంగాలీవాళ్లల్లో ఏమన్నా ఉన్నా



14-10-49

14-10-49

లేమో, మహారాష్ట్రుల్లో ఏమన్నా ఉన్నారేమో నే చూళ్లేదు. నాకు తెలీదు. తెలుగు వాళ్లలో లేరు. నాకు తెలుసు. 'ఇ-క్ష్వా-కు' అంటే ఏమిటి? మీ వెధవ మొహాల్లో ఒక్కడు చెప్పలేడు రాసిస్తా, కావలిస్తే స్టాంపుమీద రాసి రిజిస్టరు చేసిస్తా...ఏమిటి సెలవిస్తారూ? నన్ను చెప్పమంటా? నే చెప్పను, చెబితే మీ కర్థంకాదు కనకా! కూర్చోండి”

ఉపన్యాసం ఇంకా సరిగా గాట్లో పడక ముందే ఉపన్యాసకుడికి చాలా సందేహాలు వస్తాయి. ఈ కుంకలు నేను ఎంత గొప్పవాణ్ణో ఇప్పటికన్నా గ్రహించారా? గ్రహించినట్టు లేదే? పనిలోపని, వీళ్ళకు పెద్దవాళ్ళ సమక్షంలో ఎట్లా ప్రవర్తించాలో ఇప్పుడే నేర్పెయ్యకూడదూ? వాడెవడో సిగరెట్టు అంటించాడు! నేను మాట్లాడుతున్న ఈ సభమీద తనకు గౌరవం లేదని చూపించటానికేనా? ఆ కుంకలు నవ్వుకుంటున్నారు! నన్ను చూసేనా? ఆమూల నలుగురు చేరి వేరే సభ పెట్టారే!

“దీన్ని సభ అంటారు. సభలో కూచునే వాళ్లకి సభ్యత తెలియాలి. ఇది క్లబ్బనుకున్నారో, ఎన్నికల మీటింగనుకున్నారో నాకు తెలియడం లేదు. సిగిరెట్లు కాల్చేవాళ్లూ, మాట్లాడుకునే వాళ్లూ తక్షణం లేచిపోండి.” (సభలో కొంచెం కోలాహలం)

సభ ఏర్పాటు చేసినవారు వచ్చి ఉపన్యాసాన్ని శ్రద్ధగా ఆలకించవలసిందనీ సద్దు చేయవద్దనీ సదస్యులకు విన్నవించుకుంటారు. ఆ తరవాత ఉపన్యాసం సాగుతుంది. ఇక్ష్వాకులకు సంబంధించిన ఉపన్యాసంలో ఈ కింది మహత్తర విషయాలు మనకు తెలుస్తాయి.

“మనం బానిసత్వంలో ఉండి మరీ ముందుకు వచ్చాం. ఇప్పుడు మనకు వెనక్కు తిరిగిపోయే స్వాతంత్ర్యం వచ్చింది. మనం ఇక్ష్వాకులనాటికి పోవాలి. అక్కడ ఆగాలి. ఈ రైళ్లూ, ఈ విమానాలూ, ఈ గడియారాలూ ధర్మాన్ని నాశనం చేశాయి. ఎందుకివి? టైమెంత అయిందో ప్రతిక్షణమూ చూసుకోవాలా? మనం గడియారం చూడకపోతే కాలం జరగదా? జీవితమంటే ఏమిటి? పుట్టటమూ, పెరగటమూ, చావటమూ- ఇంతేగా? ఈ భాగ్యానికి రైళ్లెందుకు? గడియారా లెందుకు? యథార్థ జ్ఞానం బ్రహ్మజ్ఞానం. అది సంపాయించడానికి విమానా లెందుకు? శాస్త్రపరిశోధన లెందుకు? మన ఋషీశ్వరులు ఇళ్లూ వాకిళ్లూ కూడా వర్జించారే. మనకీ ఆరాటాలూ, తాపత్రయాలూ, యుద్ధాలూ దేనికి?

“స్వరాజ్యం కావాలి, కావాలి, అన్నారు. వచ్చింది! తృప్తి అయిందా? ఏం వొరిగింది? జీవితం ఏ విధంగా బాగుపడింది? మరింత ఛండాలమయింది. స్వభాషా, స్వసంస్కృతీ నిజమైనవి. అవి పోగొట్టుకున్నాం. అవి సంపాదించాలి. అంతేగాని స్వరాజ్యం దేనికి దిక్కుమాలిన రాజ్యం. నిన్ను నువ్వు నిగ్రహించుకో లేవు గాని రాజ్యాధికారంతో అందర్నీ నిగ్రహిస్తావూ? దేనికి? ఏం సాధించటానికి? అందర్నీ తపస్వులను చేస్తావా చెయ్యి! కృతయుగం తెస్తావా! తీసుకురా? రామరాజ్యం నిలబెడతావా? నిలబెట్టు! లేకపోతే ఈ ఆర్భాటమంతా కట్టిపెట్టు!...స్వాతంత్ర్యం వచ్చిందిట, స్వాతంత్ర్యం! నీనోట మాట్లాడే భాష నీదేనా? నీ నెత్తిమీది జుట్టు నీదేనా? నువు కట్టిన కట్టు నీదేనా? ఏంస్వాతంత్ర్యం వచ్చింది నీకు?... లేదూ, కమ్యూనిజమని గంతులేస్తావు. తుపాకీ తీసుకుని అందర్నీ కాల్చటమేగా కమ్యూనిజమంటే? రష్యా చెప్పినట్టు వినటమేగా నీ మతం? ఇదేనా స్వరాజ్యం?...”

